ప్రజాశక్తి
సోమవారం 31 జులై 2023 5
శ్రీకాకుళం

జాతీయ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్ : ఈ ఏడాది డిసెంబరు మూడో తేదీన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన వికలాంగులకు, వికలాంగులకు సేవలు అందిస్తున్న వ్యక్తులు, సంస్థలకు జాతీయ అవార్డు-2023 పేరుతో ప్రదానం చేయనున్నట్లు జిల్లా వికలాంగుల సంక్షేమశాఖ అధికారి కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన ఈ అవార్డుల ఎంపిక కానుందని తెలిపారు. అర్హులైన వికలాంగులు, సేవలందిస్తున్న వ్యక్తులు, సంస్థలు ఈ అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 31వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా www.awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు www.disabilityaffairs.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

జల'కల'నా..?

- బోర్ల కోసం 5,714 మంది దరఖాస్తు
- ఇప్పటివరకు 246 చోట్లే తవ్వకాలు
- 13 మంది రైతులకే విద్యుత్ కనెక్షన్లు
- మూడేళ్లుగా రైతుల ఎదురుచూపులు

జిల్లాలో సాగునీటి సౌకర్యం లేక వేలాది ఎకరాల భూములు నిరుపయోగంగానే ఉన్నాయి. ఆ భూముల్లో ఉచితంగా బోర్లు వేసి వాటిని వినియోగంలో తీసుకొస్తామంటూ వైసిపి ప్రభుత్వం రెండున్నరేళ్ల కిందట వైఎస్సార్ జలకళ పథకాన్ని తీసుకొచ్చింది. బోర్లతో పాటు విద్యుత్ కనెక్షన్ అందిస్తామని చెప్పడంతో రైతులు ఉత్సాహంగా దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ, సర్వే పూర్తి చేసి అర్హులైన వారికి అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్న తరుణంలో ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో అన్నదాతల ఉత్సాహంపై నీళ్లు చల్లినట్లయింది. విద్యుత్ కనెక్షన్ల ఖర్చు నిర్ణీత మొత్తం కంటే దాటితే రైతులే భరించాలని ప్రభుత్వం చెప్పడంతో రైతులు ఉసూరుమంటున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

చిన్న, సన్నకారు రైతులకు మేలు కలిగించేందుకు వైసిపి ప్రభుత్వం సెప్టెంబర్ 28, 2020లో ప్రారంభించింది. బోరు సౌకర్యం లేని 2.5 ఎకరాల నుంచి ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులను అర్హులుగా పేర్కొంది. బోర్ల తవ్వకం, విద్యుత్ కనెక్షన్లను ఉచితంగా ఇస్తామంటూ ప్రకటించింది. ప్రస్తుతం అందులో మార్పులు చేయడంతో అన్నదాతలు ఉసూరుమంటున్నారు. ఐదెకరాల్లోపు వారికి సైతం రూ.రెండు లక్షల్లోపు మాత్రమే విద్యుత్ కనెక్షన్ల ఖర్చు చేస్తామని అంతకంటే ఎక్కువైతే, రైతులే భరించాల్సి ఉంటుందని పేర్కొంది. ఇప్పటివరకు వేసిన వాటికి యధాతథంగా డబ్బులు చెల్లించనున్నట్లు తెలిసింది. ఇకపై కనెక్షన్లకు రైతులే చెల్లించాల్సి ఉంటుందని తెలుస్తోంది. దీంతో ఇన్నాళ్లు ఉచిత విద్యుత్ కనెక్షన్లు వస్తాయని ఎదురుచూస్తున్న రైతులకు షాక్ ఇచ్చినట్లయింది. దరఖాస్తుదారుల్లో ఐదు ఎకరాల్లోపు ఉన్న వారే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన ప్రకారమైతే వీరందరికీ ఉచితంగా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. రాయితీని రూ.రెండు లక్షలకే పరిమితం చేయడంతో, వందల సంఖ్యలోనే రైతులు అర్హత సాధించే పరిస్థితి నెలకొంది.

13 చోట్లే విద్యుత్ కనెక్షన్లు

జిల్లాలో వైఎస్సార్ జలకళ పథకం కోసం మొత్తం 5,714 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 4,690 దరఖాస్తులు అర్హమైనవిగా తేల్చారు. వాటిలో 2,299 చోట్ల సర్వే పూర్తి చేశారు. సర్వే పూర్తయిన వాటిలో 1057 ప్రాంతాల్లో బోర్ల తవ్వకాలకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటివరకు 246 చోట్ల బోర్లు తవ్వారు. 229 ప్రాంతాల్లో నీళ్లు పడగా 17 చోట్ల నీరు పడలేదు. 13 మంది రైతుల పొలాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.

కోటబొమ్మాళి మండలం ఊడికలపాడులో ట్రాన్స్‌ఫార్మర్ వేసి కనెక్షన్ ఇవ్వని అధికారులు

వేల సంఖ్యలో దరఖాస్తులు... పదుల్లో తవ్వకాలు

చిన్న, సన్నకారు రైతులను ఆదుకునేందుకు గతంలో ఇందిర జలప్రభ, ఎన్‌టిఆర్ జలసిరి పేర్లతో ప్రభుత్వాలు అమలు చేశాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని మార్పులు చేసి వైఎస్సార్ జలకళగా పేరు మార్చింది. బోర్లు, విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించడంతో రైతులు ఆశతో దరఖాస్తు చేసుకున్నారు. ప్రారంభం నుంచి పలు నిబంధనలు మార్చడం, గిట్టుబాటు కాక డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు రాకపోవడం, నిధులలేమి, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం తదితర కారణాలతో పురోగతి కనిపించడం లేదు. జిల్లాలో ఎచ్చెర్ల, ఆమదాలవలస, పలాస నియోజకవర్గాల్లో మాత్రమే బోర్ల తవ్వకాలకు డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు వచ్చాయి. ప్రభుత్వం చెల్లిస్తున్న ధర గిట్టుబాటు కావడం లేదంటూ మిగిలిన నియోజకవర్గాల్లో ఏజెన్సీలు ఆసక్తి చూపడం లేదు. వేల మంది రైతులు దరఖాస్తు చేసుకుంటే, ఈ రెండేళ్లలో వందల సంఖ్యలోనే బోర్లు తవ్వారు. పదుల సంఖ్యలోనే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.

అర్ధాంతరంగా ఆపేశారు

కొందరి పొలాల్లో బోర్లు తవ్వినా మోటార్లు ఇవ్వలేదు. విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినా, ఇప్పటివరకు కనెక్షన్ ఇవ్వలేదు. నీళ్లు ఉంటే రెండో పంటగా కూరగాయలను సాగు చేయాలనుకున్నా, ప్రస్తుతం మోటారు లేకపోవడం పొలాన్ని అలానే వదిలేశారు. మరికొన్నిచోట్ల పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదు. ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు రూ.రెండు లక్షల వరకు విద్యుత్ కనెక్షన్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పినా, ఆ తర్వాత ఎక్కడా ఒక్క కనెక్షన్ ఇవ్వలేదు.

కొన్ని చోట్ల విద్యుత్‌శాఖ కనెక్షన్లు ఇచ్చినా వాటికయినా ఖర్చునూ ప్రభుత్వం చెల్లించలేదని తెలుస్తోంది. ప్రభుత్వం విద్యుత్‌శాఖకు డబ్బులు ఇవ్వకపోవడంతో విద్యుత్‌శాఖ కనెక్షన్లను ఆపేసింది. దీంతో బోర్లు తవ్వి విడిచిపెట్టేయంతో మట్టి కూరుకుపోతోందని, త్వరగా తమకు విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

మణిపూర్ సంక్షోభం ముందస్తు కుట్ర

రాష్ట్రపతి పాలనకు 'అరసం' డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మణిపూర్ సంక్షోభం అకస్మాత్తుగా తలెత్తింది కాదని, అక్కడి ఖనిజ సంపద దోపిడీకి కార్పొరేట్‌శక్తుల కోసం రూపొందించిన ముందస్తు కుట్ర అని కవులు, రచయితలు, కళాకారులు, పలు సాంస్కృతిక, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. అరసం జిల్లా అధ్యక్షులు నల్లి ధర్మారావు అధ్యక్షతన నగరంలోని క్రాంతి భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశం మణిపూర్ సంక్షోభాన్ని ముందస్తు కుట్రగా పేర్కొంది. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ అక్కడి ఆదివాసీ తెగలను విభజించి, పాలించే ప్రక్రియకు బ్రిటిష్ వారు బీజాలు వేశారని చెప్పారు. అందమైన ఆ ప్రాంతానికి చాలా కాలం రాష్ట్ర హోదా రాలేదని, స్వతంత్ర భారత ప్రభుత్వాలు కూడా రాజకీయ ప్రయోజనాల కోసం అక్కడి తెగల మధ్య చిచ్చు పెడుతున్నాయని విమర్శించారు. ఆ రాష్ట్రంలో అమూల్యమైన ఖనిజ సంపద ఉందని, కార్పొరేట్‌శక్తులకు దాన్ని కట్టబెట్టడానికి తాజా సంక్షోభాన్ని సృష్టించారని చెప్పారు. దీని వెనుక బిజెపి డబుల్ ఇంజిన్ సర్కార్ కీలకపాత్ర పోషిస్తోందని విమర్శించారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి మాట్లాడుతూ అటవీ భూములు, ఖనిజ సంపద గల పర్వతాలను ఆక్రమించడానికి ఈ సంక్షోభం సృష్టి వెనుక కారణమన్నారు. మెజారిటీ తెగ మొయితీలకు యుద్ధంలో వాడే ఆయుధాలను ప్రభుత్వమే సరఫరా చేస్తోందని చెప్పారు. ఈ కుట్రకు మతం ముసుగు వేసి, ప్రశ్నించే వారిపై కేంద్ర ప్రభుత్వ అనుకూల శక్తులు ఎదురుదాడి చేస్తున్నాయన్నారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసు మాట్లాడుతూ మణిపూర్ సంక్షోభంలో మహిళలు, పిల్లలే తొలి బాధితులు కావడం చాలా బాధ కలిగిస్తోందన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఎంతటి పెను సంక్షోభం ఏనాడు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించే వారిపై కేసులు, దాడులు, అరెస్టులతో కేంద్రం వేధిస్తోందని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మిస్కా కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఛత్తీస్‌ఘడ్‌లో సల్వాజుడుం సంస్థలా మణిపూర్‌లో కొన్ని తీవ్రవాద సంస్థలతో కేంద్ర ప్రభుత్వం రహస్య అవగాహన చేసుకుందని మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్ కె.వి జగన్నాథరావు విమర్శించారు. సోషల్ మీడియాలో పౌర స్పందన తగినంత స్థాయిలో లేదని డిటిఎఫ్ అధ్యక్షులు కోత ధర్మారావు ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా సంఘ్ పరివార శక్తులు వాస్తవాలను వక్రీకరిస్తూ, ఇంటర్నెట్‌ను గుప్పెట్లో పెట్టుకుని లౌకిక విలువలను ధ్వంసం చేస్తోందన్నారు. ఎస్ఎన్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కల్లేపల్లి రాంగోపాల్, జిల్లా అధ్యక్షులు డి గణేష్, ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి సనపల నరసింహులు, జర్నలిస్టు సంఘం నాయకులు ఎం.ఈశ్వరరావు మాట్లాడారు. పత్తి సుమతి, తంగి ఎర్రమ్మ, కంచారాన భుజంగరావు, చింతాడ తిరుమలరావు, బొడ్డేపల్లి భూపతిరావు, కలమట దాసుబాబు మణిపూర్ పరిణామాలపై కవితలను చదివి వినిపించారు. సమావేశంలో ఇస్కఫ్ జిల్లా కార్యదర్శి జి.వి నాగభూషణ్, విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్ రవి, కుటుంబ సంక్షేమ, హక్కుల సంఘం కన్వీనర్ ఎం.కళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయులపై నిరంతరం ఒత్తిడి పెంచి విద్యాశాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెవికె కిట్లు సకాలంలో ఇవ్వకుండా విద్యార్థుల బయోమెట్రిక్ అమలు కావడం లేదని ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం తగదన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలో యాప్‌ల భారం తగ్గిస్తామని, ఒకే యాప్ లో వివరాలన్నీ నమోదు చేసేలా చూస్తామని విద్యాశాఖ అధికారులు హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. యాప్‌లను కుదించకపోగా, అదనంగా ప్రశస్త యాప్‌ను ఇచ్చి నెలాఖరులోపు పాఠశాల విద్యార్థులు ఆరోగ్యానికి సంబంధించిన సర్వే చేయాలని చెప్పడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పాఠశాలకు రాని విద్యార్థులను డ్రాప్ బాక్సులో ఉంచి ఆ విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. అలా చేర్చుకున్న విద్యార్థులకు జెవికె అథెంటిఫికేషన్ ఎందుకు పూర్తి చేయలేదని ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల వేతనాలు రెండు నెలలుగా చెల్లించడం లేదని, వెంటనే జీతాలు చెల్లించే చర్యలు చేపట్టాలన్నారు. నాడు-నేడు పనుల నుంచి ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని, ఉపాధ్యాయులను 45 రోజులుగా శిక్షణా తరగతుల పేరుతో బోధనేతర కార్యక్రమాల్లో తిప్పడం సరికాదన్నారు. ఎఫ్ఎ-1 పరీక్షల షెడ్యూల్‌ను మరో వారం రోజులు పొడిగించాలని కోరినా ఇంగ్లీష్ మీడియంలోనే పరీక్షలు రాయాలని విద్యాశాఖ అధికారులు చెప్పడం సరికాదన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్ర

విద్యార్థులకు స్వేచ్ఛనిచ్చి తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో పరీక్ష రాసేందుకు అనుమతించాలన్నారు. మున్సిపల్ అర్బన్ ఎంఇఒ పోస్టులు మున్సిపల్ ఉపాధ్యాయులకే వచ్చే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. సర్వీస్ రూల్స్ త్వరగా ఆమోదించి బదిలీలు ప్రమోషన్స్ నిర్వహించాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోర్టు ఉత్తర్వుల మేరకు 2008 డిఎస్‌సిలో ఎంపికై ప్రస్తుతం ఎంటిఎస్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. నూతన విద్యా విధానం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 1170ను రద్దు చేయాలని, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులపై వ్యవహరిస్తున్న తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఆగస్టు 12న ఫ్యాప్టో ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు కె.వైకుంఠరావు, ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, కె.దాలయ్య, పి.సూర్యప్రకాశరావు, ఎం.వి రమణ, హెచ్.అన్నాజీరావు, జి.సురేష్, ఆర్.పరమేశ్వరరావు, పి.మురళీధరరావు, మురళీప్రకాష్, జి.నారాయణరావు పాల్గొన్నారు.

'నోట్ల' కేసులో మలుపులు

- నోట్ల మార్పిడి వ్యవహారంలో రౌడీషీటరే ప్రధాన సూత్రధారి
- పోలీసుల అదుపులో ఎనిమిది మంది నిందితులు
- పరారీలో ఒకరు

ప్రజాశక్తి - పలాస

రూ.రెండు వేల నోట్ల మార్పిడి కేసు మలుపులు తిరుగుతోంది. ఈ వ్యవహారంలో స్థానికులు ముగ్గురు సూత్రధారులుగా నిన్నటి వరకు భావించగా, రౌడీషీటర్ సంతోష్ ప్రధాన సూత్రధారి అని పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. సంతోష్ విలాసాలకు అలవాటు పడి ఇటువంటి మోసాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. కాశీబుగ్గకు చెందిన ఈయన విశాఖపట్నంలో ప్రస్తుతం నివాసం ఉంటున్నాడు. సంతోష్‌కు ఈ ప్రాంత రాజకీయ నాయకులు, పోలీసు అధికారులతో ఎక్కువ సంబంధాలు ఉన్నాయి. విశాఖపట్నం నుంచి కోల్‌కతా వరకు రౌడీషీటర్‌కు నేరగాళ్లతో పరిచయాలు ఉన్నాయి. సంతోష్‌పై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులున్నట్లు తెలుస్తోంది. బంగారు వర్తకులు, బడా వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని సంతోష్ పథకం రూపొందించి తన ప్రధాన అనుచరులతో పని కానిస్తాడు. ముందుగా డీల్ కుదుర్చుకొని వారి డబ్బుతో తాము చెప్పిన చోటుకు వచ్చిన తర్వాత డబ్బుతో ఉడాయించే విధంగా స్కెచ్ వేస్తాడు. ఇటువంటి ఘటనే తాజాగా నోట్ల మార్పిడి వ్యవహారంలో జరిగింది. ఇటువంటి కార్యకలాపాల కేసుల్లో ఇరుక్కుని జైలుపాలై, తిరిగి బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. డబ్బులు సులువుగా సంపాదించాలి, విలాసవంతంగా జీవితం గడపాలనే వ్యక్తులను తన వద్దకు చేర్చుకుని వారి అవసరాలకు, జల్సాలకు డబ్బులు అందించి ఇటువంటి నేరాలు చేయడానికి వారిని ఉపయోగించుకుంటాడు. తాను తెర వెనుక ఉండి మంత్రాంగం నడిపిస్తాడు. నోట్ల మార్పిడి ఘటనలో పలాసకు చెందిన కొంతమందిని భాగస్వామ్యులు చేసినట్లు తెలుస్తోంది.

అసలేం జరిగింది..?

ఇటీవల నరసన్నపేటకు చెందిన ఒక వ్యాపారికి పలాసకు చెందిన ఒక బ్యాంకు మేనేజర్ మధ్యవర్తిత్వం వ్యవహరించి రూ.50 లక్షల రూ.500 నోట్లు ఇస్తే, రూ.కోటి వరకు రూ.రెండు వేల నోట్లు ఇస్తామని నమ్మబలికాడు. నోట్ల మార్పిడికి పలాస జూనియర్ కళాశాల సమీప ప్రాంతంలో అడ్డాగా చేసుకుని అక్కడకు తీసుకురావాలని చెప్పాడు. నరసన్నపేటకు చెందిన సదరు వ్యాపారి రూ.500 నోట్లు రూ.50 లక్షలకు తీసుకురాగా, వాటిని పరిశీలిస్తున్న క్రమంలో సదరు వ్యక్తులు రూ.రెండు వేల నోట్లు ఇవ్వకుండా కాలయాపన చేశారు. అదే సమయంలో సినీఫక్కీలో పోలీస్ సైరన్ వేసుకుంటూ వచ్చి రూ.50 లక్షలతో ఉడాయించారు. దీంతో వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేసినా, కేసు నమోదులో తాత్సారంతో ఆ పంచాయితీ ఎస్‌పి వద్దకు చేరింది. ఈ వ్యవహారంలో ఎవరెవరు ఉన్నారు?, వారెవరు?, పోలీసులు కేసు నమోదులో ఎందుకు తాత్సారం చేశారనే అంశాలు చర్చనీయాంశంగా మారాయి.

పోలీసుల అదుపులో ఎనిమిది మంది నిందితులు

ఈ కేసులో కాశీబుగ్గ పోలీసులతో పాటు ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆదేశాల మేరకు సిసిఎస్ పోలీసులూ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. ఈ కేసులో ఇప్పటికే కాశీబుగ్గ పోలీసులు ఎనిమిది మందిని అదుపులోని తీసుకోగా, ఒకరు పరారీలో ఉన్నట్లు సమాచారం. కాగా, కేసు నమోదుపై తాత్సారంలో కాశీబుగ్గ పోలీసులు చెప్తున్న వివరాలు పొంతన లేకుండా ఉన్నాయి. నరసన్నపేటకు చెందిన వ్యాపారి పోలీసులు ఫిర్యాదు చేసి కేసు వద్దని, డబ్బులు ఇప్పిస్తే చాలని అన్నారని కాశీబుగ్గ సిఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. పెద్ద నేరం కాబట్టి డిఎస్‌పి దృష్టిలో పెట్టాలని ఎఫ్ఐఆర్‌పై సంతకం చేయాలని చెప్పామన్నారు. ఎటువంటి కేసు వద్దని రాతపూర్వకంగా ఇచ్చారని తెలిపారు. కేసు ఛేదించే క్రమంలో దర్యాప్తు కోసం నరసన్నపేట వెళ్లి వ్యాపారికి వివరాలు అడిగినా వివరాలు అందించడం లేదన్నారు. అందువల్లే కేసు నమోదులో జాప్యమవుతోందని చెప్పారు. అయినా నాలుగైదు రోజుల్లో కేసును ఛేదిస్తామన్నారు. అయితే అదే వ్యాపారి తాను ఫిర్యాదు చేసినా కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేయడం లేదని ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. ఎస్‌పి జోక్యంతో కేసు విచారణ చకచకా సాగుతోంది.

ఆయుర్వేద వైద్యంపై అపోహలు వద్దు

- రూట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆధారంగా వైద్యం
- దీర్ఘకాలిక వ్యాధులకు సరైన చికిత్స
- జిల్లాలో 14 డిస్పెన్సరీల ద్వారా వైద్య సేవలు
- ప్రభుత్వ ఆయుష్ విభాగం వైద్యాధికారి పి.జగదీష్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆయుర్వేద వైద్యంపై అపోహలు వీడాలని ప్రభుత్వ ఆయుష్ విభాగం సీనియర్ వైద్యాధికారి పి.జగదీష్ అన్నారు. వైద్య రంగంలో అతి ప్రాచీనమైన ఆయుష్ వైద్యం దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసేందుకు తోడ్పడుతోందన్నారు. రూట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆధారంగా వైద్యం అందించి రోగాలను నయం చేయనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 14 డిస్పెన్సరీల్లో ఆయుర్వేద వైద్యం, 12 డిస్పెన్సరీల ద్వారా హోమియో, రెండు చోట్ల యునానీ డిస్పెన్సరీలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. అన్నిచోట్లా రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆయుష్ వైద్య సేవలపై ప్రజలకు నమ్మకం కలగడానికి తీసుకుంటున్న చర్యలు, ఇతర అంశాలపై ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

ఆయుష్ శాఖ దాఆరా జిల్లాలో అందుతున్న వైద్యసేవలు ఎలా ఉన్నాయి?

ఆయుష్ రంగంలో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రాచీన వైద్యరంగంలో ఆయుష్ ఎంతో కీలకం. సహజసిద్ధంగా లభించే మూలికలు, ఆకులు, ఇతర రసాలతో వైద్యసేవలు అందించడం జరుగుతుంది. మందుల్లో ఇతర రసాయనాలకు తావుండదు. అందువల్ల సైడ్‌ఎఫెక్ట్స్ ఎంతమాత్రం ఉండదు. ఈ మందులు వాడుతున్న వారిలో కొన్ని అపోహలు ఉన్నాయి. మందులు వాడినా ఆలస్యంగా తగ్గుతుందని కొందరు... వేడి, చలువ చేస్తుందని మరికొందరు, పత్యం ఎక్కువగా ఉండాలని ఇంకొందరు అపోహ పడుతుంటారు. మందుల వల్ల ఎప్పుడూ వేడి, చలువ రాదు. రోగం ప్రభావం, వాతావరణ పరిస్థితులు, ఆహారపు అలవాట్లు వల్లే ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. దీనికితోడు అత్యవసరం తగ్గాలనుకునే వారు ఈ మందులు వినియోగించడం ఆలస్యమవుతోందని మళ్లీ ఇంగ్లీషు మందులు వాడడం జరుగుతోంది. ఆలస్యంగా తగ్గినా మరోసారి అటువంటి వ్యాధికి గురికాకుండా ఉండేందుకు ఈ మందుల వాడకం ఎంతో ఉపయోగపడుతుంది.

ఆలస్యంగా తగ్గడానికి గల కారణాలేమైనా ఉన్నాయా?

ఆయుష్ వైద్యంలో ప్రదానంగా ఇంజక్షన్ అనేది ఉండదు. నోటి మాత్రలు, లేహం, పౌడర్లు, సిరప్, లేపనం, ఆయిల్స్ మాత్రమే ఉంటాయి. వీటి వల్ల శరీరంలో మందుల ప్రభావం చూపడానికి కొంత సమయం పడుతుంది. ఇంజక్షన్ల వాడకం వల్ల గంటల వ్యవధిలో తాత్కాలిక ఉపశమనం ఉంటుంది. అందువల్ల ప్రజలు వాటి వైపే మొగ్గు చూపుతున్నారు. ఆయుష్ వైద్యం కోసం ప్రత్యేకమైన రోగులు వస్తుంటారు. వారు వ్యాధి ఆలస్యంగా తగ్గినా శాశ్వత ఉపశమనం దొరుకుంతుందన్న భావనతోనే డిస్పెన్సరీలకు వస్తున్నారు. వారు తీసుకున్న మందులు క్రమం తప్పకుండా వాడడం వల్ల ఉపశమనం లభిస్తోంది. అందువల్లే ఈ వైద్యానికి ప్రత్యేకంగా ప్రాధాన్యత ఉంది.

ఆయుష్ విభాగం ద్వారా ఎంతమంది ఉద్యోగులు సేవలందిస్తున్నారు?

ఆయుష్ పరిధిలో 14 ఆయుర్వేద డిస్పెన్సరీలు, 12 హోమియో, రెండు యునానీ డిస్పెన్సరీలు ఉన్నాయి. వాటికితోడు కొత్తగా జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ద్వారా మూడు ఆయుర్వేదం, ఐదు హోమియో డిస్పెన్సరీలను కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తున్నారు. ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల ద్వారా మరికొన్ని కేంద్రాలను ఏర్పాటు చేయడమైంది. వీటికితోడు పక్షవాతం, కీళ్లు, కండరాల సంబంధిత వ్యాధులు, రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులైన వారికి కోటబొమ్మాళి కేంద్రంగా పంచకర్మ యోగా థెరఫీ కేంద్రం ద్వారా వైద్య సేవలు అందిస్తున్నాం. ఇందులో ఇన్‌పెషెంట్లు ఉండి దీర్ఘకాలం పాటు వైద్యం పొందుతారు. యోగా, మెడిటేషన్ కూడా అందుబాటులో ఉంది.

పంచకర్మ థెరఫీ అంటే ఎలా సాగుతుంది?

రోడ్డు ప్రమాదాల్లో కాళ్లు, చేతులు, ఇతర ఎముకలు విరిగిన సందర్భాలు ఎక్కువగా ఉంటాయి. వీరితోపాటు పక్షవాతంతో బాధపడుతున్న వారికి ఆయుర్వేద సిద్ద వైద్య ప్రక్రియ నిర్వహించడం ద్వారా నయం చేయడానికి వీలుంటుంది. అటువంటి రోగులకు వమనం, విరేచనం, వస్తి, నసేకర్మ, జులుకా (రక్తమోక్షం) వంటి థెరపీలు నిర్వహించడం ద్వారా తిరిగి నడిచేందుకు వీలుగా వైద్యం అందిస్తున్నాం.

పూర్తిస్థాయిలో వైద్యులు అందుబాటులో ఉన్నారా?

ఆయుష్ శాఖ పరిధిలోని ఆయుర్వేదిక్ డిస్పెన్సరీల్లో తొమ్మిది మంది వైద్యులు పనిచేస్తుండగా, ఐదు చోట్ల వైద్యులు లేరు. హోమియోలో ఐదుగురు మాత్రమే పనిచేస్తుండగా ఏడుగురు వైద్యుల ఖాళీగా ఉన్నాయి. యునాని రెండు డిస్పెన్సరీలు ఉన్నా రెండుచోట్ల వైద్యులు లేరు. సిబ్బంది కొరత అదే స్థాయిలో ఉంది. ఎన్ఆర్‌హెచ్ఎం పరిధిలోని అన్ని పోస్టుల్లో వైద్యులు అందుబాటులో ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దఎత్తున మందులు క్రమం తప్పకుండా సరఫరా చేస్తుండడం వల్ల రోగులకు పూర్తిస్థాయి వైద్యం అదిస్తున్నాం.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు ఎలా అందిస్తున్నారు?

ప్రతి డిస్పెన్సరీ పరిధిని ఒక గ్రామాన్ని వైద్యులు దత్తత తీసుకుని ఆ గ్రామంలో నూటికి నూరు శాతం ఆయుర్వేదం, హోమియో, యునానీ మూడింటిలో ఏదో ఒక వైద్యం మాత్రమే అందించి, అన్ని రోగాలను నయం చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. అందులో భాగంగా ప్రస్తుతం జిల్లాలో 30 గ్రామాలు దత్తత తీసుకుని వైద్యం అందిస్తున్నాం. ప్రజల్లో అపోహలు తొలగించేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం.

మహాసభలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నిరంతరాయంగా ఉద్యోగుల పక్షాన పోరాడి హక్కులను సాధించుకుంటున్న ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలను ఆగస్టు 20, 21 తేదీలలో విజయవాడలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో జిల్లా కార్య నిర్వాహక కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన ఎన్‌జిఒ అసోసియేషన్ 21వ రాష్ట్ర మహాసభలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కానున్నారని చెప్పారు. మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా పది వేల మంది ఉద్యోగులు హాజరు కానున్నారని తెలిపారు. మహాసభల ద్వారా ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులంతా మహాసభలకు తరలి రావాలన్నారు. మహాసభలకు హాజరయ్యే ఉద్యోగులకు మూడు రోజుల పాటు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, మెరుగైన ఐఆర్‌తో పాటు పిఆర్‌సి సాధనకు సంఘం కృషి చేస్తోందని చెప్పారు. సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, నాయకులు కె.జయరావు, ఆర్.వేణుగోపాల్, గోవింద పట్నాయక్, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పురుషోత్తం నాయుడు

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

రావిశాస్త్రి ఆదర్శప్రాయులు

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పూర్వ రచయితులు రాచకొండ విశ్వనాథ శాస్త్రి (రావిశాస్త్రి) ఆదర్శప్రాయులని, నేటి రచయితులు, కవులు వారిని ఆదర్శంగా తీసుకొని తెలుగు భాషాభివృద్ధికి పాటు పడాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ సందర్భంగా రావిశాస్త్రి బ్రోచర్‌ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యావేత్త, పూర్వ డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ సాహితీ చైతన్య కిరణాలు అధ్యక్షులు బోగెల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యాన పూర్వ రచయితలను గుర్తించుకుని వారి జయంతి నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కవి ఉమ మాట్లాడుతూ రావిశాస్త్రి జిల్లాలో జన్మించి న్యాయవాదిగా పనిచేసి మంచి రచయితగా పేరుపొందారని అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం మాండలీకంలో అనగారిన ప్రజల ఆవేదన సాహిత్యంతో రచనలు చేశారని అన్నారు. చైతన్య ప్రవంతి, కథాసాగరం, బీవర్, గోల్డ్, అల్పజీవి, ఆరుసారా-రాజాలు, రాచకొండ కథలు రచించారని అన్నారు. కార్యక్రమంలో డబ్బీరు గోవిందరావు, డబ్బీరు వాసు, వెంకటరావు, సదాశివుని కృష్ణ, రామచంద్రరావు, శర్మ పాల్గొన్నారు.

పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

అభివృద్ధి చేయలేక తప్పుడు ప్రచారాలు

ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కంచిలి

నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయలేక, అధికార పార్టీ నాయకులు ప్రజల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని దోళగోవిందపురం పంచాయతీలో ఆదివారం తెలుగుదేశం పార్టీ నాయకులు భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. అనంతరం రేభాదేవిపట్నంలో ఈ కార్యక్రమానికి కొనసాగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందని ప్రజలకు తెలుసన్నారు. రోడ్డు, సామాజిక అభివృద్ధి పనులకు నిధులు మంజూరు టిడిపి హయాంలోనే జరిగిందని గుర్తు చేశారు. ఏ పనులకు, ఏ నిధులు మంజూరు జరిగిందో వాటి వివరాలు తెలియని కొంతమంది నాయకులు అవగాహన లోపంతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మాదిన రామారావు, పిలక చినబాబు, ఎం.ఎం.పట్నాయక్, బొడ్డ అప్పారావు, పురుషోత్తంరెడ్డి, టి.వి.రమణ, రమేష్‌రెడ్డి, పూర్ణ పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధి బాహుదా నదికి ఆనుకుని ఉన్న గ్రామాల నుంచి రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంది. నది నుంచి ఇసుక తవ్వకాలను ప్రభుత్వం పూర్తిగా నిలిపి వేశారు. అనుమతులు లేకుండానే ఇసుక అక్రమంగా తరలిపోతుంది. వాస్తవానికి ఇచ్ఛాపురం, కొళిగాం, అరకభద్ర, బిర్లంగి గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతుంది. అధికార పార్టీ నాయకులు కొన్ని రోజులుగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షాలు కురుస్తున్నా ఇసుకాసురులకు ఇసుక వర్షం కురుస్తున్నట్లే ఉంది. నీటిలో నుంచి ట్రాక్టర్లతో ఇష్టానుసారంగా ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. దీనిపై ఎస్ఇబి, పోలీసులు, రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి చేడకపోవటం శోచనీయం. ఎవరూ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇసుక దందా మరింత ఎక్కువతుంది. నదిని గుల్ల చేస్తున్నా పట్టించుకోరా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అడ్డుగోలుగా ప్రకృతి సంపదను సొంత ఆస్తుల తవ్వేస్తున్నారు. ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. వాల్టా, తదితర చట్టాలను గాలికొదిలేశారు. అటు ఒడిశా రాష్ట్రం, ఇటు విశాఖపట్నం, రాజమండ్రి ప్రాంతాలకు తరలించి కాసులు పోగేసుకుంటున్నారు. ఇసుక తవ్వకాల వల్ల పర్యావరణానికి ముప్పుందని తెలిసినా ఎవరూ అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

నదితో ట్రాక్టర్ మునిగినంత నీరు ఉన్నా యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతుంది. అయితే ఇక్కడ అధికార పార్టీ నాయకులతో పాటు ప్రతిపక్ష నాయకలూ జతకట్టి ఇసుక రవాణా చేస్తుండడం కొసమెరుపు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దాడులు చేపట్టి ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా నిరోధించాలని స్థానికులు కోరుతున్నారు.

అందరి సహకారంతో అక్రమ రవాణా నియంత్రణ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఎన్ని చట్టాలున్నా మానవ అక్రమ రవాణా జరుగుతునే ఉన్నాయని, దీనిని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని స్థానిక మండల న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెలమల అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కోటబొమ్మాళి ఇన్‌ఛార్జి జూనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు స్థానిక మహాత్మ జ్యోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞానం సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ అక్రమరవాణాలలో ఎక్కువగా మహిళలు, చిన్నపిల్లలు ఉంటున్నారని అన్నారు. ఎక్కువగా వలసలకు వెళ్లే తల్లిదండ్రుల పిల్లలకు, వితంతువులు, విడాకులు పొందినవారని, మానసిక వైకల్యం ఉన్నవారిని అన్నారు.

మాట్లాడుతున్న అప్పలనాయుడు

దీనిని నివారించేందుకు పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా పనిచేస్తే మానవ అక్రమ రవాణాను అరికట్టవచ్చునన్నారు. ప్రమాద పరిస్థితి ఎదురైనప్పుడు మొబైల్ ఫోన్ల ద్వారా ప్రస్తుతం దిశ యాప్, సామాజిక మాధ్యమాల ద్వారా తక్షణమే రక్షణ పొందవచ్చునని వివరించారు. కార్యక్రమంలో కోర్టు కానిస్టేబుల్ బాలకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీరైకన్నా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'108' సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి- పలాస

పలాస సామాజిక ఆస్పత్రి ఆవరణలో 108 సిబ్బందికి ఆదివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. సంస్థలో పనిచేస్తున్న 108 సిబ్బందికి నూతన పోకడలకు అనుగుణంగా ఎఇఎంఎస్ జిల్లా మేనేజర్ నజీర్ సమక్షంలో డివిజన్ ఒఇ హరిప్రసాద్ పర్యవేక్షణలో ఒజెటి నెయ్యిల కృష్ణ శిక్షణా తరగతులను నిర్వహించారు. 12 ఏళ్లలోపు పిల్లలు ఆరోగ్య సమస్యలు, వాటి నివారణ, ఆపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తులకు సిపిఆర్ చేయు విధానం, ట్రోమ ఎమర్జెన్సీస్, ఎయిర్ వే మేనేజ్‌మెట్, 108 అంబులెన్స్‌లో ఉండే పరికరాలు, మందులు, వాటి ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు.

కొత్తూరు : మాట్లాడుతున్న రవికుమార్

టిడిపి హయాంలో మహిళాభివృద్ధి

కొత్తూరు : మాజీ సిఎం చంద్రబాబునాయుడు హయాంలోనే మహిళలకు పెద్దపేట వేశారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. మండలంలోని కుద్దిగాంలో మహిళాశక్తిని ఆదివారం ప్రారంభించారు. అనంతరం టిడిపి మినీ మేనిఫోస్టోను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నెల్లి అచ్యుతరావు, మాతల గాంధీ, తిరుపతిరావు, ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.

పలాస: మహిళలు అభివృద్ధి చెందాలన్నా... ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నా టిడిపి హయాంలోనే సాధ్యమని మున్సిపాలిటీ మహాశక్తి మహిళాలు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అంబుసోలిలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాబిల్లి లావణ్య, బడ్డ లావణ్య, కె.సుజాత, చెల్లూరు. ఛార్మిల, బోనెల భాను, ఆంబోడి ఈశ్వరమ్మ, కొత్త రాజేశ్వరి పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

రణస్థలం రూరల్ : వచ్చే నెల 1న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని శ్రీకాకుళం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బయ్యానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు కొత్త ఎబి స్విచ్‌లు, లైన్ మెంటేనేన్స్, తీగలు మార్పు చేస్తున్నామని అన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు రణస్థలం సెక్షన్ పరిధిలో ఉన్న రణస్థలం, జె.ఆర్.పురం, బావరాజుపాలెం, బండిపాలెం నగరపాలెం, కంబాలపేట, బంటుపల్లి, తిరుపతిపాలెం, పున్నణపాలెం, సంచాం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు విద్యుత్‌శాఖ సిబ్బంది సహకరించాలని కోరారు.

బహుమతులు స్వీకరిస్తున్న మహిళలు

ఉత్సాహంగా వంటల పోటీలు

శ్రీకాకుళం అర్బన్ : మెప్మా, కాన్ఫడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్ ఇండియా, రోటరీ సంయుక్తంగా నగరంలోని రైతు బజారు వద్ద గల మహిళా మార్టులో వంటల పోటీలను ఆదివారం నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, వైసిపి నాయకులు ధర్మాన రాంమనోహర్ నాయుడులు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ మారిన మానవ జీవన ప్రమాణాలు, ఆహారపు అలవాట్ల కారణంగా శరీరానికి తగిన పౌష్టికాహారం దొరకక అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని అన్నారు. ఈ రోగాల బారిన పడకుండా ఉండేందుకు చిరు ధాన్యాల వాడకం ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. అంతర్జాతీయ తృణ ధాన్యాల సంవత్సరంగా ఈ ఏడాదిని గుర్తిస్తామని అన్నారు. మెప్మా పీడీ ఎం.కిరణ్‌కుమార్, కోవే ఎపి చాప్టర్ అధ్యక్షులు రాధిక, రోటరీ నుంచి గీతాశ్రీకాంత్ పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: స్థానిక బిసి కాలనీకి చెందిన సేనాపతి తిరుపతిరావు (55) టెక్కలిపాత జిల్లా ఆస్పత్రి సమీపంలోని ఆదివారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరుపతిరావు ఎన్‌టిఆర్ కాలనీలోని ఓ భవన నిర్మాణ సామగ్రి దుకాణంలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో టెక్కలి మీదుగా వెళ్లిన రాజారాణి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. కాగా, ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి అనంతరం టెక్కలి జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఘటనపై పలాస జిఆర్‌పి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి గాయాలు

కోటబొమ్మాళి: మండలం జాతీయ రహదారిలో పొడుగుపాడు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం రెల్లగోదాయవలసకు చెందిన పిలక పున్నయ్య గాయపడ్డాడు. పున్నయ్య కోటబొమ్మాళి వైపు నుంచి తన ద్విచక్రవాహనంపై వస్తూ పొడుగుపాడు మలుపు వద్ద మరో బైక్‌ను ఢీకొని గాయపడ్డాడు. ఎస్ఐ షేక్ మహ్మద్‌అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటుబాంబులతో వ్యక్తి అరెస్టు

కోటబొమ్మాళి: మండలం మూలపేట సమీపంలో ఓ చెరువు గట్టుపై 24 నాటుబాంబులతో పొడుగుపాడుకు చెందిన జోగి సింహాచలంను పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ షేక్ మహ్మద్‌అలీ ఆదివారం తెలిపారు. సింహాచలం మూలపేట సమీపంలో ఓ చెరువు గట్టుపై పందులను చంపేందుకు నాటు బాంబులు విసరగా బాంబుపేలిందని, అక్కడే ఉన్న మూలపేటకు చెందిన సారిపల్లి మల్లేసుతో పాటు మరికొంత మందికి స్వల్ప గాయాలయ్యాయని అన్నారు. మల్లేసు ఇచ్చిన పిర్యాదు మేరకు సింహాచలంను అదుపులోకి తీసుకుని డిఎస్‌పి ముందు హాజరుపరిచి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గాలిస్తున్న పోలీసులు, అధికారులు

కొనసాగుతున్న గాలింపు చర్యలు

ప్రజాశక్తి- పోలాకి

వంశధార కాలువలో ముప్పిడి శాంతారావు శనివారం గల్లంతైన విషయం విదితమే. గల్లంతైన వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి కావడంతో ఆదివారం నుంచీ వంశధార అధికారులు, ఎస్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ సిబ్బంది, గజీతగాళ్లు ఇలా 45 మంది వరకు కాలువ గుండా గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. కాలువలో దిగి అడుగడుగునా గాలిస్తున్నారు. అయినా ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. వంశధార కాలువలో గుర్రపు డెక్క, చెట్లు దట్టంగా ఉండటంతో వెతకడం కూడా కష్టతరంగా మారింది. వంశధార డిఇ బి.శ్రీహరి, తహశీల్దార్ కె.శ్రీరాములు, సిఐ ప్రసాదరావు, ఎస్ఐ సత్యనారాయణ, ఎఇ శ్యామలరావు, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్ కుమార్, ఆర్.త్రినాథరావు పాల్గొన్నారు. కాంతారావు ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

అంత్యక్రియలు నిర్వహిస్తున్న చిన్నికృష్ణ

అనాథ శవానికి అన్నీ తానై..

పలాస: అనాథ శవం ఉందని తెలిస్తే అంత్యక్రియలు నిర్వహించేందుకు పరుగులు తీస్తారు ఆ ఉద్యోగి. అనాథ శవానికి నేను ఉన్నాను అంటూ ముందుకొచ్చి అన్నీ తానై చేయవలసిన కర్మకాండ పూర్తి చేశారు. పలాస కాంప్లెక్స్ ఆవరణలో ఓ అనాథ వ్యక్తి ఆదివారం మృతి చెందారు. మృతుడికి ఎవరూ లేరని విషయం తెలుసుకున్న లలితా ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు, నరసన్నపేట ఎఎంసి కార్యదర్శి చిన్నికృష్ణ ముందుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించి అందరి మన్ననలు పొందారు. అంత్యక్రియలకు కైవల్య రథం అందుబాటులో లేకపోవడంతో సంస్థ సభ్యులు మామిడి వెంకటరమణ, హనుమత్ జ్యోతి, సాయి పాడిని మోసి శ్మశానానికి తీసుకెళ్లారు. ఇప్పటి వరకు 500 అనాథ మృతదేహాలకు చిన్నికృష్ణ అన్నీతామై కర్మకాండలు నిర్వహించారు. టెక్కలి, పలాస డివిజన్‌లో ఏ అనాథ శవం ఉన్నా పోలీసులు, స్థానికులు చిన్నికృష్ణకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

టెక్కలి: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, దురంగతాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించి అక్కడ శాంతిని నెలకొల్పాలని, ఆదివాసీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి యడ్ల గోపీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివాసీలపైన, చర్చిలపైన జరుగుతున్న దాడులను ఆపాలని కోరారు. రెండు సామాజిక తరగతి వారితో చర్చించి సమస్యను పరిష్కరించారు. మణిపూర్ సిఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా సేవకే అంకితం

కవిటి: తన జీవితం ప్రజాసేవకే అంకితమని, ఇప్పటి వరకూ తనను ఆదరించి, అభిమానించి తన ఎదుగుదలకు తోడ్పడిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని శవశానపుట్టుగలో ఆదివారం రామారావు దంపతులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఊరేగింపుగా తీసుకువచ్చిన గ్రామస్తులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి కడియాల పద్మ, ప్రకాష్, నాయకులు ఇప్పిలి కృష్ణారావు, బల్ది ప్రకాష్, నర్తు శివాజీ, పులకల శ్రీరాములు, మద్దిలి ఈశ్వరరావు, దట్టి అజయ్‌కుమార్, లక్ష్మణరావు, లచ్చయ్య పాల్గొన్నారు.

ఊరేగింపులో ఎమ్మెల్సీ రామారావు దంపతులు

రాజ్యాంగ పరిరక్షణకు పోరాటమే శరణ్యం

ర్యాలీ నిర్వహిస్తున్న దళితులు

టెక్కలి: రాజ్యాంగ పరిరక్షణకు పోరాటమే శరణ్యమని సమతా సైనికదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్ల సురేంద్రబాబు పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ విజ్ఞాన భవన్‌లో ఆదివారం నిర్వహించిన రాజ్యాంగం అవగాహన సదస్సు నిర్వహించారు. భారత రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత అందరిలోనూ ఉందని, అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాలను కాలరాస్తున్నారని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలపై కపట ప్రేమ చూపిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ పథకాలకు తూట్లు పొడిస్తుందని అన్నారు. ప్రశ్నించిన దళితులపై దాడులు చేస్తున్నారని అన్నారు. దళితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ముందుగా జిల్లా కార్యదర్శి చల్లా రామారావు అధ్యక్షతన అంబేద్కర్ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాల్లర్పించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర సమన్వయ కర్త పాండ్రంకి శ్రీనివాసరావు, దేబారి రామప్పడు, పిలక చంటి, పేర నాగేశ్వరరావు, రంగారావు పాల్గొన్నారు.

తిరుమల చైతన్యపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలకు పాల్పడిన పూర్వ డిఇఒ ఎస్.తిరుమల చైతన్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు డిమాండ్ చేశారు. నగరంలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పడాల తమ్మినాయుడు అధ్యక్షతన ఆఫీసుబేరర్స్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ పనితీరు, ఉపాధ్యాయ అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ప్రత్యక్ష కార్యాచరణ, ప్రణాళిక రూపొందించి ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బదిలీల్లో తిరుమలచైతన్య నిర్లక్ష్య వైఖరి, బాధ్యతారాహిత్యం వల్ల ఉపాధ్యాయులకు,

మాట్లాడుతున్న ప్రభాకరరావు

పాఠశాలలకు పెద్దఎత్తున నష్టం జరిగిందన్నారు. జరిగిన నష్టంపై 36 పేజీల నివేదిక విద్యాశాఖ కమిషనర్‌కు సమర్పించినట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు బి.రమణ మూర్తి, సూర్యారావు, రమేష్, సన్యాసిరావు, రాజు అన్నాజీబాబు, రామచంద్ర, బి.రామారావు, చింతల రామారావు, శ్రీను పాల్గొన్నారు.

పనుల నాణ్యతలో రాజీ పడొద్దు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రహదారి నిర్మాణ పనులు నాణ్యతలో అధికారులు రాజీపడొద్దని సైనూరు సర్పంచ్ అట్టాడ గోవిందరావు అన్నారు. మండలంలోని పొల్లాడ నుంచి దబ్బులపాడు మధ్య ముమ్మరంగా చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ రోడ్డు పూర్తయితే పలాస, టెక్కలి నియోజకవర్గాల మధ్య రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని అన్నారు. ఈ రోడ్డు పనులకు రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నిధులు మంజూరు చేయించారని అన్నారు. దీంతో మంత్రికి సైలాడ ఎంపిటిసి పిన్నింటి జయరాం, సర్పంచ్ అట్టాడ గోవిందరావు ధన్యవాదాలు తెలిపారు.

పిట్టపాలెం రోడ్డులో జనసేన నిరసన

నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

రణస్థలం: మండలంలోని రణస్థలం పంచాయతీ పిట్టపాలెం గ్రామం రోడ్డు దుస్థితిపై ఆదివారం జనసేన పార్టీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు డాక్టర్ విష్వక్సేన్, సువ్వాడ రామారావు మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ రోడ్డు వేసే నాథుడు లేదని అన్నారు. బస్సులు, ఆటోలు తిరగని దుస్థితి. ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే 108 వాహనం కూడా రాని పరిస్థితిగా ఈ రోడ్డు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల్లో ఈ రోడ్డు మరమ్మతులు డిమాండ్ చేశారు. లేకుంటే జనసేన పార్టీ నాయకులు శ్రమదానం చేసి రోడ్లను వేస్తామని అన్నారు. రోడ్డు గ్రాంట్ అయినా రోడ్డు వేయని పరిస్థితి ఉందని ఆరోపించారు. ఇక్కడ వైసిపి నాయకుల అసమర్థ పరిపాలనను నిలదీశారు. ఈ రోడ్డు వేసే వరకు మా పోరాటం తీవ్ర స్థాయికి తీసుకువెళ్తామని, జనసేన పార్టీ ఎప్పుడు ప్రజల పక్షాన నిలబడుతుందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గోవింద్ రెడ్డి, శ్రీనివాసరావు, రవీంద్ర, సూర్య, ఇజ్జిరోతు రమణ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని నువ్వులరేవులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాల ప్రవేశపెట్టిందని, అర్హులైన ప్రజలందరికీ చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అమలు చేస్తున్నారని చెప్పారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సహాయం నేరుగా అందుతుందని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీలదే హవా అని వారి చుట్టూ కాళ్లరిగేలా తిరిగి వారిని ప్రసన్నం చేసుకుంటే తప్ప పనులయ్యేవి కావన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా దేశంలోనే పారదర్శకమైన పాలనందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమని తెలిపారు. మత్స్యకార గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నాలుగేళ్లుగా తాను ఎంతో కృషి చేశానన్నారు. గతంలో జరిగిన అభివృద్ధికి ఇప్పుడు జరిగిన అభివృద్ధికి తేడాలను ప్రజలు గమనించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, వైసిపి మండల అధ్యక్షులు పుక్కల గురయ్యానాయుడు, మందస ఎంపిపి డి.దానయ్య, సర్పంచ్ ఎఱ్ఱా, ఉప సర్పంచ్ దేవా, కిడిసింగి సర్పంచ్ నర్తు లక్ష్మీనారాయణ, ఈరోతు హేమంత్, తహశీల్దార్ బి.అప్పలస్వామి, విఆర్‌ఒ హైమావతి, సచివాలయం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

దేశాయ్ ఛానల్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి- బూర్జ

దేశాయ్ ఛానల్ మరమ్మతుల పనులకు నీటిపారుదల శాఖ అధికారులు ఎట్టకేలకు శ్రీకారం చుట్టారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం అన్నవరం నుంచి కాలువ మరమ్మతుల పనులను ప్రారంభించారు. అన్నవరం నుంచి బూర్జ మండలం అల్లెన వరకు ఉన్న కాలువకిరువైపులా పేరుకుపోయిన జంగిల్ క్లియరెన్స్ చేస్తామని అధికారులు చెబుతున్నారు. రూ.2 లక్షలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. సకాలంలో ఈ కాలువ ద్వారా సాగునీరు అందిస్తే అన్నవరం, అంపిలి, వడమ, కొండాపురం, డొంకలపర్త, వై.పర్త, అల్లెన గ్రామాల భూములకు సాగునీరు అందుతుందని రైతులు ఆశపడుతున్నారు. అయితే అధికారులు పూర్తిస్థాయిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడితే రైతులకు ఎంతగానో ఉపయోగం ఉంటుంది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- పోలాకి

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని నరసన్నపేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు సదాశివుని కృష్ణ పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం మొక్కలు నాటారు. మొక్కలకు ప్రత్యేకంగా ట్రీ గార్డ్స్‌ను ఏర్పాటు చేసి రోజూ నీరు పోసి వాటిని రక్షించే రోజూ నీరుపోసి వాటిని రక్షించే బాధ్యత కూడా చేబడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఊన్న రంగనాథ్, సెక్రటరీ వి.నాగరాజు, కోశాధికారి, పొట్నూరు రమేష్, ఊన్న వెంకటేశ్వరరావు, వి.శ్రీనివాసరాజు, రత్నాజీ, బాలగంగాధర్, రమణసాహు, చందన నాగరాజు, కె.సాయిరాం, బి.విఆర్.గుప్త పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న క్లబ్ సభ్యులు

బూర్జ : మండలంలోని వైకుంఠపురంలో సర్పంచ్ వెంకట సత్యం ఉపాధి హామీ పథకంలో రోడ్డుకిరువైపులా మొక్కలను నాటారు. అల్లిపిల్లిగూడ గిరిజన గ్రామంలో ఏడుగురు రైతులకు 490 జీడీ, మామిడి, సపోట మొక్కలు పంపిణీ చేశామని అన్నారు. అలాగే నేరేడు చెరువు, కంబాల చెరువు, చంద్రమ్మ కోనేరు గట్టులపై 150 మొక్కలు నాటామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సూర్యకుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని ధర్మవరం శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులతో వేమన శతకం, సుమతీ శతకం, దాశరధి శతకం, భాస్కర శతకం, శ్రీకాళహస్తీశ్వర శతకంలో పద్యాలను చదివించారు. వాటి భావాలనూ విద్యార్థులకు తెలియ చెప్పేలా వివరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర రావు మాట్లాడుతూ తెలుగు వారికి సుపరిచితమైన శతకాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. సుమతి శతకం అనేది పండితులకే కాకుండా పామరులకు సైతం అర్థం అయ్యేవిధంగా సరళమైన పదాలతో వివరంగా ఉంటుందని అన్నారు. సుమతి అంటే మంచి బుద్ధి కలవాడని అర్థం అని చెప్పారు. ఈ శతకాల ద్వారా సమాజానికి మంచి బుద్ధి, చక్కని వ్యవహారశైలి



ఎచ్చెర్ల : పద్యాలను చదువుతున్న విద్యార్థి

నేర్పించాలని ఈ శతక పద్యాల ఉద్దేశమని చెప్పారు. ప్రతి విద్యార్థీ ఈ శతక పద్యాలను నేర్చుకొని పిల్లలు మంచి దారిలో నడవాలని, మంచివారుగా పేరు గడించాలని ప్రతి తల్లిదండ్రులూ ఆశిస్తారని చెప్పారు. అందుకే వారిలో మంచిని నింపేలా నీతి శతకాలను బోధిస్తారని చెప్పారు. శతక పద్యాలు వినిపించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులను వరుసగా కొయ్యాను మనోజ్, బగ్గు శ్రీవాణి, ధర్మవరపు పూజ్యశ్రీ, సురపు షర్మిల, సాధు సుష్మిలకు గ్రంథాలయం తరుపున బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు బి.సూర్యనారాయణ, పాఠకులు సురేష్, జగదీష్, మహేష్, సూరిబాబు, ప్రకాష్, శంకర్ పాల్గొన్నారు.

రణస్థలం : రణస్థలం శాఖాగ్రంథాలయంలో చదవడం మాకిష్టంలో భాగంగా దినపత్రికల పఠనం, కథలను చదవించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి దినపత్రికల్లో వచ్చిన శీర్షికను విద్యార్థి దినేష్ కుమార్‌తో చదివించారు. అనంతరం బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు ఆధ్వర్యాన చదవడం మాకిష్టం నిర్వహించారు. భాస్కర శతకం, సుమతి శతకం, వేమన శతకం గురించి వివరించారు. బి.శ్యామ్‌కు ప్రథమ, ఎస్.రాముకు ద్వితీయ, ఆర్.లలితకు తృతీయ బహుమతులు వచ్చాయి. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

11 నుంచి సంపూర్ణ శతావధానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో సాంస్కృతిక సేవా రంగాల్లో ముందుండే శ్రీసుమిత్ర కళాసమితి ఆధ్వర్యాన ఆగస్టు 11 నుంచి మూడు రోజుల పాటు నగరంలోని బాపూజీ కళామందిర్‌లో అవధాన పద్మాకరం పేరిట సంపూర్ణ శతావధాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. నగరంలోని సమితి కార్యాలయంలో ఆదివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏలూరుకు చెందిన వద్దిపర్తి పద్మాకర్ పాల్గొని సంస్కృతాంధ్ర భాషల్లో అవధానం నిర్వహించనున్నామని తెలిపారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు గుత్తు చిన్నారావు, మండవిల్లి రవి, కొంక్యాన మురళీధర్, పులఖండం శ్రీనివాసరావు హాజరయ్యారు.

ఆర్థికసాయం అందజేస్తున్న జనసేన నాయకులు

జన సైనికుల ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని 17వ వార్డు పూజారిపేటకు చెందిన నిరుపేద కుటుంబానికి జనసైనికులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల పూజారిపేటకు చెందిన మునకాల ప్రభాకరరావు మృతి చెందారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో దయనీయ స్థితిలో ఉన్నారు. కుమార్తె చదువు నిమిత్తం జనసేన నాయకులు పాత్రుని పాపారావు, కొత్తకోట నాగేంద్ర, కోరుకొండ మల్లేశ్వరరావు, అంపిలి విక్రమ్ కలిసి రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఎల్లవేళలా కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో అంబలా కొటేష్, సురేష్, తేజేశ్వరరావు, అనూషకుమార్, సేపెన రమేష్, బాలకృష్ణ, చందు మనోహర్, వెంకిబాబు, రాము పాల్గొన్నారు.

'చింతామణి' సేవలు అభినందనీయం

కవిటి: హైదరాబాద్‌కు చెందిన ఇందిరాదేవి, మణిబాబు ఆర్థికసాయంతో ఉద్దానం ప్రాంతంలో ఎంతోమంది పేద విద్యార్థుల ఉన్నత చదువులకు చింతామణి ట్రస్టు చేస్తున్న సేవలు అభినందనీయమని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. ఆర్థిక సమస్యలతో ఉన్నత చదువులకు ఇబ్బంది పడుతున్న మండలంలోని కొత్తపాలెంకు చెందిన నిరుపేద మత్స్యకార కుటుంబానికి చెందిన గంటా కోదండరావుకు ట్రస్టు సభ్యులు ఆదివారం రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ట్రస్టు సభ్యులు పాండవ శేఖర్, ఆరింగి మధు, బి.రమణమూర్తి, పి.లక్ష్మణమూర్తి, ఉమామహేష్, జన్ని లోకనాథం, బావన రవి, పులకల వెంకటరావు, ఉపాధ్యాయులు నెయ్యిల విశ్వనాథం, పి.వాసు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎంపిటిసి గోపి

సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు

ఇచ్ఛాపురం : మండలంలో మండపల్లి పంచాయతీ మండలపల్లి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు బాగా దెబ్బతింది. టిడిపి ఎంపిటిసి కోళ్ల గోపి సొంత నిధులు వెచ్చించి ఆదివారం రోడ్డు మరమ్మతులు పనులు చేపట్టారు. మండపల్లి మెయిన్ రోడ్ కూడలి, పోస్టాఫీసు వద్ద రోడ్డు పనులను దగ్గరుండి చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి ఎంపిటిసి గోపి తరణి బెహరా, కార్యకర్తలు అనిల్ సాహు, కృష్ణ యాదవ్, పరమేష్, హేమంత్ శెట్టి, జీవన్ రెడ్డి ఛత్రపతి, యుగంధర్, పురుషోత్తం, జాని మాస్టారు, దీనబంధ్, సూర్య తిప్పాన కృష్ణ, చిరంజీవి పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

పలాస : రాష్ట్రంలో విద్యుత్ మీటరు రీడర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.కుమరస్వామి కోరారు. కాశీబుగ్గ ప్రగతి భవన్ ఆవరణలో మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 3,800 మంది ఉద్యోగులు పనిచేస్తున్నామని, 25 ఏళ్లుగా పనిచేస్తున్నా తమకు ఉద్యోగ భద్రత కరవైందని ఆందోళన వ్యక్తం చేశారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు పెడితే తమ ఉపాధికే ఎసరు వచ్చే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ ఉపాధికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో టెక్కలి, పలాస డివిజన్ల ప్రధాన కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్, కోశాధికారి ఎస్.అనిల్, ఓంకార్, బలరామ్, తేజేశ్వరరావు, సురేష్ ఉన్నారు.

పురందేశ్వరి దృష్టికి గ్రానైట్ సమస్యలు

ప్రజాశక్తి- టెక్కలి

జిల్లాకే తలమానికంగా నిలిచిన గ్రానైట్ సమస్యలను పరిష్కరించాలని నియోజకవర్గ బిజెపి నాయకులు హనుమంతు ఉదయ్‌భాస్కర్ కోరారు. విశాఖపట్నంలో పర్యటిస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరిని ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ గ్రానైట్ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. పన్నులు కుదింపు, పెంచిన సీనరేజ్ ధరలను తగ్గించడం వంటి నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలన్నారు. భూగర్భ గనులశాఖ ద్వారా ప్రభుత్వానికి రావల్సిన పన్నులను ప్రయివేట్ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందని అన్నారు.

పురందేశ్వరితో ఉదయ్‌భాస్కర్

దీంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. గ్రానైట్ సమస్యలను పరిష్కరిస్తేనే పరిశ్రమ నిలబడు తుందని అన్నారు. తద్వారా ఎందరో కార్మికులకు ఉపాధి కలుగుతుందని అన్నారు. ఈయనతో పాటు చిగిలిపల్లి పాపారావు, ఇళ్ల తిరుపతి, దవళ సీతారాం ఉన్నారు.

ఒబిసిలో చేర్చేందుకు కృషి

ఎంపీని కలిసిన కళింగ కోమట్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పర్చుకుని జీవనం సాగిస్తున్న కళింగ కోమట్లను, శిష్టకరణాలు, సొండిలు, అవరలను కేంద్రం ఒబిసిలో చేర్చడానికి తన వంతు పూర్తి సహకారాన్ని అందిస్తానని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు హామీనిచ్చారు. నగరంలోని ఆయన నివాసంలో కళింగ కోట్ల ఒబిసి సాధన కమిటీ ప్రతినిధులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కళింగ కోమట్ల నుంచి తనకు ఎల్లప్పుడూ సహకారం ఉందని, అలాగే కేంద్ర స్థాయిలో ఒబిసి సాధనకు తన వంతు కృషి చేస్తున్నామని అన్నారు. గతంలో బిసిల జాబితాలో చేర్చడంలో టిడిపి ప్రభుత్వం సహకారాన్ని అందించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా కళింగ కోమట్ల ప్రతినిధులు బోయిన గోవిందరాజులు, కోరాడ హరిగోపాల్, పి.వి.రమణ, పొట్నూరు తులసీరాం, గుప్తా, బలివాడ మల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు డబ్బీరు వాసు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి- సోంపేట

పాలకులు, అధికారులు రైతు సమస్యలపై దృష్టి సారించాలని రైతు కులం సంఘం కన్వీనర్ జె.బి.వి.ప్రసాదరావు కోరారు. మండలంలోని కొర్లంలోని ఆలయంలో రైతు కులం సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోంపేట మండలంలో రైతుల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు. నీటి లభ్యత ఎరువుల సరఫరా, గిట్టుబాటు ధర సమస్యలపై స్పందించాలన్నారు. సమావేశంలో ఆర్.గణపతి,

మాట్లాడుతున్న ప్రసాదరావు

ఎం.శంకరరావు, మద్దిల నాగేశ్వరరావు, బి.మదన్మోహన్, తామడ వాసుదేవరావు, బుద్దాన శ్రీకృష్ణ, సంగారు లక్ష్మీనారాయణ, వెదుళ్ల మాధవరావు, బత్తిన బాలరాజు, కూర్మారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి సాగు

లైన్ షోయింగ్ పద్ధతిలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని నిమ్మతొర్లాడ, చేపేనపేట, కొరపాం, జి.కె.వలస గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా రైతుల చేత లైన్ షోయింగ్ పద్ధతిలో వరి నాట్లను వేయించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విభాగం యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు మాట్లాడుతూ ఏడు ఎకరాల విస్తీర్ణంలో వరుస క్రమంలో వరినాట్లు వేయించామని తెలిపారు. పంట వేసినప్పటి నుంచి రాజీలేని సూత్రాలను తప్పకుండా పాటింపచేసేలా చేస్తున్నామని తెలిపారు. సీడ్ టు సీడ్ హోల్ ప్రకృతి సేద్య రైతులను ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యేలా సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని తెలిపారు. యూనిట్ పరిధిలోని రైతులతో ఆసక్తితో వరి లైన్స్ షోయింగ్ పద్ధతిని చేస్తున్నామని వివరించారు.

సన్మానిస్తున్న నాయకులు

తేజస్వినికి సన్మానం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని దువ్వానపేటకు చెందిన దువ్వాన తేజస్విని పదో తరగతిలో 561 మార్కులు సాధించింది. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ మండలశాఖ ఆధ్వర్యాన గ్రామంలో ఆదివారం ఆమెను సన్మానించారు. అనంతరం రూ.5 వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా దళిత మహాసభ ప్రధాన కార్యదర్శి దేబారికి రాము, జిల్లా ఉపాధ్యక్షులు డి.కుసుమ, ఎచ్చెర్ల దళిత మహాసభ గౌరవ అధ్యక్షులు సూర్యారావు, మండల శాఖ అధ్యక్షులు. కడియారావు కుమార్‌స్వామి, దుప్పాడ సూరిబాబు, ఎపిడిఎంఎస్ జిల్లా మీడియా కన్వీనర్, మండల ప్రధాన కార్యదర్శి సింక శివకుమార్, గౌరవ అధ్యక్షులు గుర్ల సింహాద్రి, మండలశాఖ మహిళా అధ్యక్షులు యండ తమ్ముడమ్మ, ఉపాధ్యక్షులు అప్పారావు, డి.ప్రసాద్, రాజయ్య, కె.రాము, వర్కింగ్ అధ్యక్షులు కె.సీతారం, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.శ్రీను, నారాయణరావు పాల్గొన్నారు.

లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో దేవభూషణరావుకు చోటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో విద్య, సామాజికవేత్త, లయన్స్‌క్లబ్ జిల్లా పూర్వ అధ్యక్షులు డాక్టర్ బాడాన దేవభూషణరావుకు చోటు దక్కింది. లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా ఉన్న సమయంలో ఒడిశా రాష్ట్రంలోని బాలాసోర్ వద్ద రైళ్ల ఢీకొన్న ప్రమాదంలో ఆయన బృందం వెళ్లి బాధితులకు సహాయక చర్యలు అందించారు. బృందం అందించిన సేవలకు ఆ సంస్థ యురోపియన్ యూనియన్ హెడ్ రిపబ్లిక్ ఆఫ్ క్రొయేషియా డాక్టర్ ఇవాన్ గసీనా, ఇంటర్నేషనల్ చైర్మన్ డాక్టర్ అవినాష్ డి సకుండేలు వర్చువల్ విధానం ద్వారా ఆదివారం ఈ రికార్డును అందజేశారు. అరుదైన గౌరవం దక్కడాన్ని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, డాక్టర్ ఎం.కె.మిశ్రో, కార్యదర్శి టెక్కం రామ్‌గోపాల్, కోశాధికారి శిల్లా మణి, సభ్యులు జె.భారతి, ఆంజనేయులు, సునీల్, బోగెల ఉమామహేశ్వరరావు, పి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

అప్పలనాయుడు పరామర్శ

లావేరు : లావేరుకు టిడిపి కార్యకర్త ఇజ్జు సత్తిబాబు తండ్రి ఇజ్జు చిన్నబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైసిపి నాయకులు లుకలాపు అప్పలనాయుడు ఆదివారం ఇజ్జు చిన్నబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు. ఈయన వెంట మాజీ సర్పంచ్‌లు వద్ది సత్యం, గొర్లె రామినాయుడు, ఎల్.మల్లేశ్వరరావు, యందవ శ్రీనివాసరావు, పి.గురునాయుడు, తరిగొప్పల శ్రీనివాసరావు ఉన్నారు.

ముమ్మరంగా వంతెన పనులు

ఇచ్ఛాపురం: పట్టణంలోని బాహుదా రోడ్డు వంతెన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. భారీ వాహనం రాకతో కుప్పకూలిన వంతెన నిర్మాణ పనులు మొదట్లో నత్తనడకన సాగినా... ప్రస్తుతం నిర్మాణ పనులు వేగవంతమవుతున్నాయి. రోడ్లు, భవనల శాఖ అధికారులు రామినాయుడు, మోహనరావు పర్యవేక్షణలో కూలిన వంతెన నిర్మాణ పనులు చేపట్టుతున్నారు. వర్షాలు కురవకపోతే మరో పది, పదిహేను రోజుల్లో తాత్కాలిక వంతెన పనులు పూర్తవుతాయి. కూలిన వంతెన వల్ల పట్టణ, గ్రామీణ ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రొక్లెయినర్‌తో చేస్తున్న పనులు